క్లుప్తంగా

కళాజాతా



బాలికల సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పిస్తున్న కళాజాతా కళాకారులు

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కళాజాతా కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఐసీడీఎస్ పీవో విజయగౌరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాకారులు గాన, నృత్య ప్రదర్శల ద్వారా బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలు, బాలికల హక్కులు, సంరక్షణ చట్టాలు, గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్‌లపై అగాహన కల్పించారు. బాలికలను రక్షిద్దాం.. చదివిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమం ఆద్యంతం ఆకట్టుకోవడంతో విద్యార్థులు కూడా కళాకారులు చెప్పింది వినేందుకు ఆసక్తి చూపించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె.ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

అన్నసంతర్పణ



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో అన్నసంతర్పణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి దర్శనానికి విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఉదయం సుప్రభాతసేవ, మంగళాశాసనం తదితర పూజలు చేశారు. పుట్టుదేవుని వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేసి, స్వామి వారికి తలనీలాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

జూలై 7న రథయాత్ర ప్రారంభం



ప్రత్యేకాలంకరణలో ఉత్సవమూర్తులు

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి గ్రామంలో కొలువైన జగన్నాథస్వామి ఆలయ ఆవరణలో జూలై 7వ తేదీ నుంచి రథయాత్ర ప్రారంభమవుతుందని యాత్ర నిర్వాహకులు తెలిపారు. అదేనెల 15వ తేదీన యాత్ర ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. శనివారం ఉదయం ఉత్సవ విగ్రహాలకు దైవస్నానం చేసి, ప్రత్యేకంగా అలంకరించారు.

సన్మానం



బ్రాంచి మేనేజర్‌ను సన్మానిస్తున్న వెలుగు సిబ్బంది

గరుగుబిల్లి: ఏపీజీవీబీలో బదిలీపై వేరే ప్రాంతానికి వెళ్లిన బ్రాంచి మేనేజర్ వి.వి.ఆర్.రెడ్డిని వెలుగు, ఉపాధి హామీ పథకం సిబ్బంది శనివారం సన్మానించారు. అనంతరం ఆయన సేవలను వక్తలు ప్రశంసించారు. తనకు విధి నిర్వహణలో సిబ్బంది ఎంతో సహకరించారని, వారికి తన కృతజ్ఞతలని సన్మాన గ్రహీత తెలిపారు. కార్యక్రమంలో వెలుగు సీసీ తిరుపతిరావు, వీవోఏలు, తదితరులు పాల్గొన్నారు.

జల్ జీవన్ మిషన్ పనుల పరిశీలన



పెదఖేర్జిల వద్ద రక్షిత మంచినీటి పథకం నిర్మాణ పనులు పరిశీలిస్తున్న డీఈఈ నాగేశ్వరరావు

కొమరాడ: మండలంలోని పెదఖేర్జిల, రేగులపాడు, పూర్ణపాడు, సీతమాంబపురం, కొత్తవలస గ్రామాల్లో జరుగుతున్న జల్ జీవన్ మిషన్ పనులను గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం డీఈఈ కె.నాగేశ్వరరావు శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రతీ ఇంటికి కుళాయి కనెక్షన్ ద్వారా తాగునీరు అందిస్తున్నామన్నారు. ఆయన వెంట ఏఈఈ నవీన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

వైభవంగా జగన్నాథుడి జ్యేష్ఠాభిషేకం



వీరఘట్టం: జగన్నాథస్వామికి సుగంధ ద్రవ్యాలతో శుద్ధిస్నానం చేయిస్తున్న అర్చకుడు లింగరాజ్‌రథో



పాలకొండ రూరల్: పూజలు అందుకుంటున్న జగన్నాథుడు

పాలకొండ/పాలకొండ రూరల్:

జగములనేలు జగన్నాథుని రథోత్సవానికి సంప్రదాయబద్ధంగా అంకురార్పణ జరిగింది. ఒడిశా పూరీ దేవస్థానం మాదిరి స్వామివారి జ్యేష్ఠాభిషేక వేడుకలు వైభవంగా నిర్వహించారు. దేవాదాయ శాఖ కార్యనిర్వాహణాధికారి సర్వేశ్వరరావు నేతృత్వంలో అర్చకులు జగన్నాథ, బలభద్ర, సుభద్ర, సుదర్శనలు (చతుర్ధామూర్తులు)లకు పుణ్యజలాలతో శనివారం అభిషేకాలు చేశారు. స్వామివారి కనులను కడిగారు. అనంతరం చీకటి గదికిలోకి చేర్చారు. ఏడాదికి ఒకసారి నిర్వహించే ఈ పుణ్య కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు పోటెత్తారు. వచ్చే నెల 7 నుంచి 17 వరకు జగన్నథుని రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల సమయంలో ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న జైయింట్ వీల్ నిర్వహణకు రూ.50 వేలు, లడ్డూ, పులిహోరా (ప్రసాదాలు) విక్రయాలకు రూ.5 వేలు ప్రథమ ధరావత్తు చెల్లించి ఈనెల 24న జరగనున్న బహిరంగ వేలంలో పాల్గొనవచ్చనని, పాత బకాయిలు ఉండరాదని ఈఓ తెలిపారు.

వీరఘట్టం: పట్టణంలోని మందిరం వీధిలో వెలసిన జగన్నాథస్వామికి జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు లింగరాజ్‌రథో స్వామివారి కనులను శుభ్రం చేశారు. అనంతరం చీకటి గదిలోకి స్వామిని తరలించారు. 15 రోజుల పాటు స్వామివారు చీకటి గదిలో విశ్రాంతి తీసుకుంటారని, అనంతరం అమావాస్య రోజున శుద్ధి స్నానం చేసిన తరువాత రథయాత్రకు బయలుదేరుతారని లింగరాజ్‌రథో తెలిపారు.

జూలై 6న నేత్రోత్సవం, 7వ తేదీ నుంచి తొమ్మిది రోజుల పాటు జగన్నాథస్వామి రథయాత్ర వైభవంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 11న హిరాపంచమి, 15న మారు రథయాత్ర ఉంటుందన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి



సూచనలిస్తున్న ఎంపీడీవో సూర్యనారాయణ

గరుగుబిల్లి: గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో పి.సూర్యనారాయణ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో శనివారం సమావేశమైన ఆయన.. రానున్న వర్షాకాలంలో మలేరియా, డెంగీ, అతిసారం, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. వాటి బారిన ప్రజలు పడకుండా పారిశుధ్య చర్యలు ముమ్మరం చేయాలన్నారు. తాగునీటి బోర్లు, బావులు, రక్షిత మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ చర్యలు చేపట్టాలన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలన్నారు. వైద్యారోగ్య సిబ్బంది కూడా గ్రామాల్లో ఫీవర్ సర్వే చేసి, జ్వరపీడితులను గుర్తించి, వారికి సకాలంలో చికిత్స అందేలా చూడాలన్నారు. మరుగుదొడ్ల వినియోగంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, ఏపీవో గౌరీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మందులు వితరణ



మందులు అందిస్తున్న రిటైర్డ్ వైద్యాధికారి ప్రభాకరరావు

గుమ్మలక్ష్మీపురం: గ్రామానికి చెందిన రిటైర్డ్ వైద్యాధికారి జి.ప్రభాకరరావు మండలంలోని తాడికొండ పీహెచ్‌సీ పరిధిలోని హెల్త్ అసిస్టెంట్లకు రూ.7 వేల విలువైన మందులను శనివారం వితరణ చేశారు. గ్రామాల్లో సీజనల్ జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో వాటిని నియంత్రించేందుకు అవసరమైన మాత్రలు అందజేశారు. రక్తహీనత నివారణకు ఉపయోగపడే ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు, ఎముకల దృఢత్వానికి అవసరమయ్యే కాల్షియం మాత్రలు పంపిణీ చేశారు. హెల్త్ అసిస్టెంట్లు ఎస్.రత్నకుమార్, పి.రాధాకృష్ణ మాట్లాడుతూ గిరిజనులకు తమవంతు సాయంగా వైద్యసేవలు అందించాలనే సదుద్దేశ్యంతో రిటైర్డ్ వైద్యాధికారి ప్రతినెలా ఈ మందులు అందజేస్తున్నారని, వారికి తమ కృతజ్ఞతలన్నారు.

ఆన్‌లైన్‌లో విద్యార్థుల వివరాలు నమోదు చేయండి



ప్రధానోపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈవో చంద్రశేఖర్, ఏటీడబ్ల్యూవో సురేష్‌కుమార్

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు/బాలికల పాఠశాలల్లో ఈ ఏడాది కొత్తగా చేరిన విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంఈవో బి.చంద్రశేఖర్, ఏటీడబ్ల్యూవో బి.సురేష్‌కుమార్ అన్నారు. మండలంలోని భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ బాలికల పాఠశాలలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో శనివారం సమావేశమైన ఆయన.. నేను బడికి పోతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. బడిఈడు పిల్లలంతా ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే విద్యాప్రమాణ్ 90 రోజుల ప్రణాళిక కార్యక్రమాన్ని కూడా జయప్రదం చేయాలన్నారు. విద్యార్థులందరికీ స్టూడెంట్ కిట్లు అందేలా చూడాలని, ప్రణాళికాబద్ధంగా తరగతుల వారీగా విద్యాబోధనకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

విద్యార్థులందరికీ స్టడీ కిట్లు అందించాలి

● డీఈఓ పగడాలమ్మ



పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న డీఈఓ పగడాలమ్మ

వీరఘట్టం: పాఠశాలలోని ప్రతీ విద్యార్థికి స్టూడెంట్ కిట్లు అందజేయాలని పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ ఆదేశించారు. వీరఘట్టం మండలం సంత-నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఆమె సందర్శించారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ప్రతీ ఉపాధ్యాయుడు లెసెన్ ప్లాన్ తయారు చేసి, దాని సాయంతో విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులను ఇప్పటి నుండే సంసిద్ధం చేయాలని, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించేలా కార్యచరణ చేపట్టాలన్నారు. హెచ్ఎం ముంజేటి ఈశ్వరరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

పాలకొండ: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో వీఏఏలు రైతులకు అందుబాటులో ఉంటూ సాగు సలహాలు, సూచనలు అందించాలని వ్యవసాయ శాఖ ఏఓ వై.వాహిని సూచించారు. మండలంలోని వీఏఏలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారిగా ఇంతవరకు రైతులకు అందించిన విత్తనాలు, కావాల్సిన ఎరువులు, రైతులు వేసిన విత్తన రకాలు, తదితర అంశాలపై సమీక్షించారు. ముందస్తు ప్రణాళిక ద్వారా ఖరీఫ్‌లో మంచి దిగుబడులు సాధించాలని సూచించారు. ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన అన్ని సేవలు అందించాలన్నారు.

వాచ్‌మన్‌కు సన్మానం



వాచ్‌మన్ మనోహర దంపతులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, పాఠశాల సిబ్బంది

భామిని: పదేళ్ల పాఠశాలలో నైట్‌వాచర్‌గా పనిచేసిన చిరుద్యోగి ఉద్యోగ విరమణ చేయడంతో శనివారం ఆయన్ను ఘనంగా సన్మానించారు. భామిని ఏపీ మోడల్ స్కూల్ నైట్ వాచ్‌మన్ నిమ్మల మనోహర ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. మోడల్ స్కూల్ ప్రిన్స్‌పాల్ ఆర్.శివకుమార్, వైస్ ప్రిన్స్‌పాల్ బాబూరావు ఆధ్వర్యంలో పాఠశాల సిబ్బంది మనోహర దంపతులను సన్మానించారు. బోధనా సిబ్బంది, విద్యార్థుల నుంచి విరాళంగా సేకరించిన రూ.1.20 లక్షలను వాచ్‌మన్‌కు అందజేశారు. ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహించడంతో ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థిక సాయం అందకపోవడంతో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు కొంత మొత్తాన్ని సేకరించి వారికి అందజేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించండి



రావివలసలో ర్యాలీలో అంగన్‌వాడీ సిబ్బంది

గరుగుబిల్లి: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు అరుణకుమారి, లక్ష్మి సూచించారు. మండలంలోని రావివలస, పెదగుడబ అంగన్‌వాడీ కేంద్రాల పరిధుల్లో అంగన్‌వాడీ సిబ్బంది శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మూడేళ్ల వయసు దాటిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు ప్రభుత్వాలు కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు. చిన్నారులకు ఆహ్లాదకర, స్నేహపూరిత వాతావరణంలో విద్య నేర్పించడంతో పాటు పౌష్టికాహారం అందజేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు హైమావతి, ప్రశాంతికుమారి, పార్వతి, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

నైట్‌హాల్ట్ బస్ నడపాలి

వీరఘట్టం: జిల్లా కేంద్రం పార్వతీపురం నుంచి వీరఘట్టంకు నైట్‌హాల్ట్ బస్సు వేయాలని వీరఘట్టం మండల ప్రజలు కోరుతున్నారు. దూరప్రాంతాల నుంచి రైలుపై పార్వతీపురం వచ్చేవారు, వివిధ పనులపై జిల్లా కేంద్రానికి వెళ్లేవారు రాత్రి 9.30 గంటల తర్వాత బస్సు సదుపాయం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని వీరఘట్టంకు నైట్‌హాల్ట్ బస్సు సర్వీసు నడపాలని ఈ ప్రాంత ప్రయాణికులు కోరుతున్నారు.



ఔత్సాహికులకు యోగా ఆవశ్యకతను వివరిస్తున్న శిక్షకులు

యోగాతో ఒత్తిడి దూరం

పాలకొండ రూరల్: ఒత్తిడిని జయించేందుకు యోగా ఎంతగానో ఉపకరిస్తుందని యోగాశిక్షకులు కె.జనార్దనరావు అన్నారు. స్థానిక రుషి యోగా కేంద్రంలో శనివారం ఔత్సాహికులకు యోగాలో శిక్షణ ఇచ్చారు. వారితో యోగాసనాలు వేయించి వాటి ఉపయోగాలను వివరించారు. శరీరానికి శక్తిని అందించటంతో పాటు మానసిక ప్రశాంతతకు యోగా దివ్య ఔషధంలా పనిచేస్తుందన్నారు. క్రమం తప్పకుండా యోగాను సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చన్నారు.

అధ్వానంగా పారిశుద్ధ్య నిర్వహణ



కొత్తవీధి సమీపంలో రోడ్డుపై పేరుకుపోయిన వ్యర్థాలు

పాలకొండ రూరల్: పట్టణంలో పలు కూడళ్ల వద్ద చెత్త పేరుకుపోవటంతో దుర్గంధం, దోమలు విజృంభిస్తున్నాయి. పారిశుద్ధ్య నిర్వహణలో నగర పంచాయతీ యంత్రాంగం నిర్లక్ష్యం వహించటంతో ఆయా ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలుతున్నాయి. అడపదడపా కురుస్తున్న వర్షాలకు పారిశుద్ధ్యం మరింత అధ్వానంగా మారింది. దీనికి తోడు శునకాలు స్వైర విహారం చేస్తూ అటుగా వెళ్లే పాదచారులను వెంబడిస్తుండటంతో వారు హడలిపోతున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, శునకాల నియంత్రణపై నగర పంచాయతీ అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా రహదారి మలుపు



చిదిమి మలుపు వద్ద పెరిగిన పిచ్చిమొక్కలు

వీరఘట్టం: వీరఘట్టం-పాలకొండ సీఎస్‌పీ రహదారిలో చిదిమి మలుపు వద్ద రోడ్డుకు ఓవైపు పెరిగిన పిచ్చిమొక్కలు ప్రమాదకరంగా మారాయి. ఎదురుగా వస్తున్న వాహనాలు సరిగా కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ఈ రహదారిలో పలుచోట్ల ఆర్‌అండ్‌బీ అధికారులు పిచ్చిమొక్కలు తొలగించారు. అయితే ఈ సెంటర్ వద్ద మాత్రం మొక్కలు తొలగించలేదు. అధికారులు స్పందించి ఈ మలుపు వద్ద పిచ్చిమొక్కలు తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

విదేశీ విహంగాలు వచ్చేశాయి..!



గురండి చెరువులో ఆహారం కోసం వలస పక్షుల వెదుకులాట

భామిని: మండలానికి విదేశీ విహంగాలు వచ్చేశాయి. తొలకరి వర్షాలు కురిసే సమయానికి దూర ప్రాంతాల నుంచి వలస పక్షులుగా పిలిచే గూడ కొంగల జాతి పక్షులు తరలి వచ్చాయి. చెట్లుపై మకాం వేశాయి. చెరువుల్లో ఆహారం వెతుకుంటున్నాయి. పొడవైన కాళ్లు, ముక్కు కలిగిన ఈ పక్షులను చూసేందుకు స్థానికులు ఆసక్తి చూపుతున్నారు. ఏటా ఈ సీజన్‌లో ఈ ప్రాంతానికి వచ్చి ఇక్కడ గుడ్లు పెట్టి పిల్లలను పొదిగాక తిరిగి వెళ్లిపోతాయని స్థానిక రైతులు తెలిపారు.

ఆక్రమణలు తొలగించాలి

పార్వతీపురం టౌన్: పట్టణ పరిధిలోని వరహాల గెడ్డ, చెరువుల్లోని ఆక్రమణలను తొలగించడంతో పాటు పూడికతీత పనులు వేగవంతం చేయాలని సీపీఎం పార్వతీపురం పట్టణ కమిటీ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం పట్టణ కమిటీ వరహాల గెడ్డపై నిర్మిస్తున్న కల్వర్టు పనులను, గెడ్డ పూడికలను శనివారం పరిశీలించారు. అనంతరం రెవెన్యూ అధికారి శ్రీనివాసరావును, మున్సిపల్ కమిషనర్ కోన శ్రీనివాసరావులను కలిసి వినతిపత్రాలు అందజేవారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, నాయకుడు బంకురు సూరిబాబు మాట్లాడుతూ.. పార్వతీపురం పట్టణంలో చిన్నపాటి వర్షం పడినా వరహాలగెడ్డ పరిసర ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయన్నారు. గెడ్డలో ఆక్రమణలు చోటు చేసుకోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని.. అధికారులకు విషయం తెలియేసినా ఎవ్వరూ చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వరహాలగెడ్డపై ఆక్రమణలను తొలగించాలని,అలాగే గెడ్డపై నిర్మిస్తున్న కాజ్‌వే పనులపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సిద్ధార్థ్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని నేరేడుమానుగూడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. ఒడిశాలోని ఖిలాపాడొరొ గ్రామానికి చెందిన ఊలక సిద్దార్థ్, జీలకర్ర జయరాం అనే ఇద్దరు యువకులు గుమ్మలక్ష్మీపురం మండలంలోని గోరటి గ్రామంలో శనివారం జరిగిన ఓ శుభకార్యానికి తమ ద్విచక్ర వాహనంపై బయలుదేరి వెళ్లారు. రాత్రి భోజనం చేసిన తర్వాత తిరిగి తమ స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్లారు. మార్గమధ్యంలోని నేరేడుమానుగూడ గ్రామ వద్దకు వచ్చేసరికి అక్కడి ప్రధాన రోడ్డుపై ఉన్న స్పీడ్‌బ్రేకర్ గమనించకుండా వేగంగా దూసుకుపోవడంతో అదుపుతప్పి, అటువైపుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో సిద్ధార్థ్, జయరాంలకు గాయాలయ్యాయి. అప్రమత్తమైన స్థానికులు భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి క్షతగాత్రులను తరలించి, వైద్య సేవలు అందించారు.

జూలై 1 నుంచి 'స్టాప్ డయేరియా'

పార్వతీపురం టౌన్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా స్టాప్ డయేరియా అనే కార్యక్రమాన్ని జూలై 1 నుంచి జూలై 31 వరకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని వీధుల్లో యాంటీ లార్వా స్ప్రేయింగ్ చేపట్టాలన్నారు. ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. మెయిన్ రోడ్ల మీద ఉన్న దుకాణాల వద్ద డస్ట్ బిన్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగు తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మురళి, ఏఎస్ఓ వీరునాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా..

పార్వతీపురం: పట్టణంలోని భాస్కర్ జూనియర్ కళాశాలలో ఆదివారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమేజాన్ వేర్‌హౌస్(చెన్నై)లో ప్యాకింగ్, స్కానింగ్, లోడింగ్, సార్టింగ్, తదితర విభాగాలలో ఉద్యోగాలు కల్పిస్తారని పేర్కొన్నారు. పదో తరగతి ఆపై చదివిన నిరుద్యోగ యువత తమ ధ్రువపత్రాలతో హాజరుకావాలని కళాశాల ప్రతినిధులు కోరారు.

పిల్లలను బడికి పంపించాలి



ర్యాలీ చేస్తున్న సిబ్బంది, విద్యార్థులు

సీతంపేట: పిల్లలు బడిలో, పెద్దలు పనిలో ఉండాలని ట్రైబల్ వెల్ఫేర్ డీడీ అన్నాదొర అన్నారు. మండలంలోని చిన్నబగ్గ, పూతికవలస ఆశ్రమ పాఠశాలలో పరిధిలో శనివారం ర్యాలీలు నిర్వహించారు. పిల్లలను బడికి పంపించాలని, డ్రాపౌట్లు లేకుండా చూడాలని తల్లిదండ్రులకు సూచించారు. చిన్నారులను పనులకు పంపించడం నేరమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీఈఓ పి.నారాయుడు, ఏఎంఓ కోటిబాబు, సీఎంఓ చిరంజీవులు, హెచ్ఎం శారద, తదితరులు పాల్గొన్నారు.

● మైదానం కాదు గుర్రపుడెక్క



ఈ చిత్రంలో కనిపిస్తోంది పచ్చనిమైదానం అనుకుంటే పొరబడినట్లే. తోటపల్లి ప్రాజెక్ట్‌లోని నదీగర్భం ఇలా గుర్రపుడెక్కలతో నిండిపోయి అందంగా కనిపిస్తూ అటువైపుగా వెళ్లే వారి చూపును తనవైపు తిప్పుకుంటోంది. చూడటానికి ఎంతో అందంగా, ఆహ్లాదంగా కనిపించినా తొలగించడం కష్టమని అంటున్నారు. ఇవే గుర్రపుడెక్కలు సాగునీటి కాలువల్లో పెరిగితే సాగునీరు సక్రమంగా సరఫరా కాదని అంటున్నారు. అధికారులు స్పందించి, గుర్రపుడెక్క తొలగించాలని పలువురు కోరుతున్నారు.

-గరుగుబిల్లి